నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, ఆదివారం 21 ఏప్రిల్ 2024 | HYDERABAD


## గ్రేటర్‌లో బస్సుల కుదింపు నిర్ణయం వెనక్కి

నమస్తే ఎఫెక్ట్

సిటీబ్యూరో, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ) :ఎండల కారణంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బస్సుల సంఖ్య కుదించాలని గ్రేటర్ ఆర్టీసీ అధికారులు నిర్ణయం తీసుకోవడంపై 'నమస్తే తెలంగాణ' శనివారం 'భానుడి భగభగ.. బస్సులెక్కడ' అనే శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. ప్రయాణికులకు ఎదురయ్యే ఇబ్బందులను ప్రస్తావించింది. ఈ కథనానికి అధికారులు స్పందించారు. బస్సుల కుదింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నట్లు గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. యథావిధంగా 2839 బస్సులు రాకపోకలు సాగిస్తాయని వెల్లడించారు. అంతేకాదు ప్రయాణికల రద్దీ దృష్ట్యా 300 మెట్రో ఎక్స్‌ప్రెస్ , 140 సిటీ ఆర్డినరీ , 125 మెట్రో డీలక్స్ సర్వీసులు జూలై నుంచి అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు.



సరూర్‌నగర్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

# నిర్మాణ రంగం కుదేలు



### కాంగ్రెస్ సర్కారు తీరుతో గడ్డు స్థితి

### 21 రోజుల్లో అనుమతులు దేవుడెరుగు..

### నెలలు గడిచినా రాని పర్మిషన్లు

### రోజుకో నిబంధనలతో విసిగిపోతున్న బిల్డర్లు

### కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కళకళలాడిన నిర్మాణ రంగం

### ఒక్క ఏడాదిలోనే 130 ఆకాశహర్మ్యాలకు అనుమతులు

### 2023-24 ఆర్థిక సంవత్సరంలో 2456 పర్మిషన్లు.. రూ. 1107.29 కోట్లు

### 2022-23తో పోలిస్తే తగ్గిన రూ. 347.47 కోట్ల ఆదాయం

సిటీబ్యూరో: మహానగరంలో నిర్మాణ రంగం కుదేలవుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుతో కళతప్పుతున్నది. 21 రోజుల్లో అనుమతులు విషయం అటుంచి.. నెలలు గడుస్తున్నా.. పర్మిషన్లు రాకపోవడంతో బిల్డర్లు డీలాపడిపోతున్నారు. అధికారులు రోజుకో నిబంధనలు పెడుతుండటంతో విసిగిపోతున్నారు. ఫలితంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కళకళలాడిన నిర్మాణ రంగం.. ప్రస్తుతం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నది.

#### ఫైళ్లు కదలడం లేదు..

కేసీఆర్ ప్రభుత్వంలో హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీలో దరఖాస్తు చేసుకున్న 21 రోజుల్లో అనుమతి వచ్చేది. నెలకు సరాసరిగా జీహెచ్‌ఎంసీలో పది, హెచ్‌ఎండీఏ పరిధిలో 20 వరకు హైరైజ్డ్ బిల్డింగ్ (ఆకాశహర్మ్యాలకు) అనుమతులు దక్కేవి. ప్రస్తుతం మూడు నెలలు గడిచినా.. ఫైల్‌కు మోక్షం దక్కడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా.. జీహెచ్‌ఎంసీలో సుమారు రెండు, హెచ్‌ఎండీఏలో 6 వరకు ఎంఎస్‌బీలకు మాత్రమే అనుమతులు ఇచ్చినట్లు తెలుస్తున్నది. ఈ ఎంఎస్‌బీలు కూడా హెచ్‌ఎండీఏలో శంకర్‌పల్లి, జీహెచ్‌ఎంసీలో శేరిలింగంపల్లిలో మాత్రమే ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఎకరం వరకు మాత్రమే ఎంఎస్‌బీలకు అనుమతులు ఇస్తున్నారు. ఆపై ఎంఎస్‌బీలకు అనుమతులు రావాలంటే ప్రభుత్వ పెద్దల జోక్యం చేసుకుంటే తప్ప.. ఫైల్ ముందుకు కదలని పరిస్థితి.

#### ఆఫ్‌లైన్ కాదు మళ్లీ ఆన్‌లైన్‌లోకి రండి..

వాస్తవంగా ఎంఎస్‌బీ సంబంధించి దరఖాస్తులను చాలా వరకు ఆఫ్‌లైన్‌లోనే పరిశీలించి అనుమతులు ఇస్తుంటారు. మ్యానువల్ (ఆఫ్‌లైన్)లో అన్ని అర్హతలు పొంది ఫీజులు కట్టి, ప్రొసిడింగ్ లేటర్ (ఫైనల్ అప్రూవల్) కాపీని సదరు బిల్డర్‌కు అందించాల్సిన అధికారులు తాజాగా ఆన్‌లైన్ అంటూ కొత్త కొర్రీలు పెట్టారు. మ్యానువల్‌గా వచ్చిన ఫైళ్లను మళ్లీ ఆన్‌లైన్ ద్వారా నోట్ కాపీతో పర్మిషన్ పెట్టుకోవాలని అధికారులు బిల్డర్లకు సూచిస్తున్నారు. దీంతో ఇప్పటికే నెలల తరబడి ఫైనల్ అప్రూవల్ కోసం ఎదురుచూసిన బిల్డర్లకు అధికారుల తాజా నిబంధనతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి. ఈ క్రమంలోనే హెచ్‌ఎండీఏలో ఓ ఫైల్ అనుమతి కోసం అత్యున్నత స్థాయిలో కమిషనర్‌కు ఫోన్ చేయించినా.. తీరా కమిషనర్ మాత్రం రూల్ మారిందని, మ్యానువల్‌లో ఉన్న ఫైళ్లు అన్నీ ఆన్‌లైన్‌లో ద్వారా వస్తేనే ఇస్తామని తేల్చి చెప్పడం గమనార్హం. ఇక ఎంఎస్‌బీ కమిటీ నామ మాత్రమే వారి పనితీరు ఉంటోంది. కమిటీలో చాలా వరకు ఫైళ్లను ఏదో కారణం చూపుతూ తిరస్కరించుకుంటూ వస్తున్నట్లు బిల్డర్లు చెబుతున్నారు.

#### ఇద్దరు కమిషనర్ల తీరే వేరు

హెచ్‌ఎండీఏ కమిషనర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ బిల్డర్లకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. కమిషనర్ నుంచి ఫైల్ ఆమోదం పొందాలంటే తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాల్సిందేనని బిల్డర్లు అంటున్నారు. ఈ ఇద్దరు కమిషనర్లు చాలా వరకు డిస్కస్, సైట్ విజిట్ (ఇన్‌స్పెక్షన్) పేరిట రోజుల తరబడి ఫైళ్లను తమ ఆధీనంలోనే పెట్టుకుంటున్నారు. బిల్డర్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా.. కమిషనర్లను కలిసే ప్రయత్నం చేసినా.. వారు సమయానికి దొరకడం లేదని చెబుతున్నారు. హెచ్‌ఎండీఏలో ఈ నెల 16న ఓ ఫైల్‌కు సంబంధించిన సైట్ విజిట్‌కు వస్తానని చెప్పిన కమిషనర్.. చివరకు సైట్ విజిట్ లేక సంబంధిత ఫైల్‌కు అనుమతి లభించలేదు.

#### బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో..

కేసీఆర్ ప్రభుత్వంలో హైదరాబాద్ మహా నగరం విశ్వ నగరంగా ఎదగడంలో ఐటీతో పాటు రియల్, నిర్మాణ రంగాలు కీలక పాత్ర పోషించాయి. ముఖ్యంగా తెలంగాణ ఏర్పడిన తర్వాత హైదరాబాద్ నగరాభివృద్ధి సరికొత్త పుంతలు తొక్కింది. కేసీఆర్ ప్రభుత్వం అంతర్జాతీయ ప్రమాణాలతో కల్పించిన మౌలిక వసతులతో అంతర్జాతీయ పెట్టుబడులు రావడంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు భారీగా పెరిగాయి. ఇందుకు అనుగుణంగా రియల్, నిర్మాణ రంగం శరవేగంగా ఎదిగింది. దేశంలోని ఇతర మెట్రో నగరాలకు దీటుగా హైదరాబాద్ రియల్, నిర్మాణ రంగాల పురోగతి కనిపించింది. ప్రధానంగా ముంబై, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా వంటి నగరాలకు లేని భౌగోళిక అనుకూలతలు హైదరాబాద్‌కు ఉండటంతో నిర్మాణ రంగం ఆకాశమే హద్దుగా దూసుకుపోయింది. వెస్ట్ కారిడార్‌కే పరిమితమయ్యే బహుళ అంతస్తుల భవనాలు (ఎంఎస్‌బీ) అన్ని వైపులా విస్తరించడంతో పాటు కోర్ సిటీలోనూ పాత నిర్మాణాలను కూల్చివేసి కొత్తగా ఆకాశహర్మ్యాలను నిర్మించే ట్రెండ్ కొనసాగింది.

#### తగ్గిన రూ. 347.47 కోట్ల ఆదాయం

2023-24 ఆర్థిక సంవత్సరంలో జీహెచ్‌ఎంసీ ద్వారా 2456 అనుమతులు లభించాయి. రూ. 1107.29 కోట్ల ఆదాయం సమకూరింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 16329 అనుమతులు లభించగా.. అందులో 2581 ఓసీ (అక్యూపెన్సీ సర్టిఫికెట్లు) ఉన్నాయి. తద్వారా రూ. 1454.76 కోట్ల ఆదాయాన్ని జీహెచ్‌ఎంసీ సమకూర్చుకున్నది. 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోల్చి చూస్తే.. 2023-24లో రూ. 347.47 కోట్ల మేర ఆదాయాన్ని జీహెచ్‌ఎంసీ నిర్మాణ రంగ రూపంలో నష్టపోయింది. సకాలంలో అనుమతులు ఇవ్వకపోవడం, తరచూ కొర్రీలతో బిల్డర్లను ముప్పుతిప్పలు పెట్టడం, అనుమతులన్నీ నెలల తరబడి సర్కారు నిలిపివేయడం వంటి చర్యలతో నిర్మాణ రంగం తీవ్రంగా నష్టపోయిందని బిల్డర్లు వాపోతున్నారు.

#### 57 అంతస్తుల భవనానికి..

బహుళ అంతస్తుల భవనాల నిర్మాణానికి సంబంధించిన కీలకమైన సమావేశం శనివారం అమీర్‌పేటలోని హెచ్‌ఎండీఏ కార్యాలయంలో జరిగింది. మెట్రోపాలిటన్ కమిషనర్ దాన కిశోర్ నేతృత్వంలో ప్లానింగ్ విభాగం ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. 10 అంతస్తుల పైబడి హెచ్‌ఎండీఏ పరిధిలో నిర్మించే బహుళ అంతస్తుల భవనాలకు అనుమతులు ఇచ్చే అంశంపై ప్రతి గురువారం ఈ కమిటీ సమావేశమై పలు అంశాలపై సమగ్రంగా చర్చించింది. ఎంఎస్‌బీల కేటగిరీలో వచ్చే దరఖాస్తు కమిటీ పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా ఉన్న వాటికి ఆమోదం తెలుపుతుంది. తాజాగా జరిగిన కమిటీ సమావేశంలో మొత్తం 50 ఎంఎస్‌బీలకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించారు. ఇందులో 57 అంతస్తుల భవనానికి అనుమతినిచ్చినట్లు ప్లానింగ్ విభాగం అధికారి ఒకరు తెలిపారు. శివారు ప్రాంతాల్లో గేటెడ్ కమ్యూనిటీలతో పాటు భారీ బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు పెరుగుతున్నాయని, వాటికి అవసరమైన మౌలిక వసతుల కల్పన, భవిష్యత్ పరిణామాలపై ఈ కమిటీ చర్చించి పలు నిర్ణయాలు తీసుకుంటుందన్నారు.

## ఏషియన్ బ్లడ్ సెంటర్ సీజ్

సిటీబ్యూరో, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): ఎలాంటి అనుమతి లేకుండా బ్లడ్ కాంపోనెంట్స్ తయారు చేసి, రోగులకు అనధికారికంగా విక్రయిస్తున్న నగరంలోని ఏషియన్ బ్లడ్ సెంటర్‌ను డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు సీజ్ చేశారు. ఏషియన్ బ్లడ్ సెంటర్‌కు డీసీఏ నుంచి కేవలం రక్త దాన శిబిరాలు నిర్వహించి, రక్తాన్ని సేకరించడంతో పాటు నిల్వ చేయడం, ప్రాసెస్ చేసి, 'హోల్ హ్యూమన్ బ్లడ్'ను మాత్రమే పంపిణీ చేసేందుకు అనుమతి ఉంది. సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్, ప్యాక్డ్ ఆర్‌బీసీ, ప్లాస్మా వంటి కాంపోనెంట్స్ తయారీకి, వాటిని విక్రయించేందుకు అనుమతి లేదు. కానీ ఈ కేంద్రం నిర్వాహకులు మాత్రం నిబంధనలకు విరుద్ధంగా బ్లడ్ కాంపోనెంట్స్‌ను తయారు చేయడమే కాకుండా అనధికారికంగా సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్, ఆర్‌బీసీ వంటి బ్లడ్ కాంపొనెంట్స్‌ను రోగులకు, బ్లడ్ బ్యాంక్‌లకు విక్రయిస్తున్నట్లు ఏషియన్ బ్లడ్ సెంటర్ టెక్నీషియన్ డీసీఏ అధికారుల విచారణలో వెల్లడించాడు. ఈ మేరకు అధికారులు రెండు ప్యాక్డ్ ఆర్‌బీసీ బ్యాగ్స్, ఒక ప్లాస్మా బ్యాగ్‌తో పాటు సేల్ బిల్స్, అకౌంట్ బుక్స్‌ను సీజ్ చేశారు. డీసీఏ డైరెక్టర్ జనరల్ కమలాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు జరిపిన ఈ దాడుల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు శివ తేజ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

### హైదరాబాద్ 4.. మల్కాజిగిరి 7

## నామినేషన్లు

సిటీబ్యూరో, మేడ్చల్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ పార్లమెంట్ స్థానానికి శనివారం 4, మల్కాజిగిరి స్థానానికి 7 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగనున్నదని చెప్పారు.

## చిలుకూరు ఆలయంలో 'వివాహ ప్రాప్తి' రద్దు

మొయినాబాద్, ఏప్రిల్ 20: చిలుకూరు బాలాజీ ఆలయంలో ఆదివారం నిర్వహించాల్సిన 'వివాహ ప్రాప్తి' కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ప్రధాన అర్చకులు రంగరాజన్ వెల్లడించారు. శుక్రవారం గరుడ ప్రసాదం పంపిణీలో తలెత్తిన ఇబ్బందుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు తమ ఇండ్లలోనే చిలుకూరు బాలాజీని స్మరించుకోవాలన్నారు. సాయంత్రం కళ్యాణోత్సవం యథావిధిగా ఉంటుందన్నారు.

## గొంతెత్తి కొట్లాడేది బీఆర్‌ఎస్సే

ఆర్కేపురం, ఏప్రిల్ 20 : తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్లమెంట్‌లో గొంతెత్తి కొట్లాడేది బీఆర్‌ఎస్సే ఎంపీలేనని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. శనివారం సరూర్‌నగర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. చేవెళ్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి జ్ఞానేశ్వర్‌ను గెలిపిస్తే పార్లమెంట్‌లో రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడుతారని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో బడుగు, బలహీనవర్గాల గళం వినిపించాలంటే తప్పనిసరిగా కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ రాష్ట్రం పట్ల స్పష్టమైన అవగాహన ఉన్న ఏకైక వ్యక్తి సీఎం కేసీఆర్ అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఖర్చు మొత్తం లక్ష కోట్లు కాలేదని, కానీ కాంగ్రెస్, బీజేపీ నాయకులు కేసీఆర్ కుటుంబం కాళేశ్వరంలో లక్ష కోట్లు అవినీతికి పాల్పడిందని ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. రెండు, మూడు పిల్లర్లు కుంగిపోయ్యాయని, వాటిని రిపేర్ చేయకుండా బీఆర్‌ఎస్ పార్టీని బద్నాం చేయడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా, డివిజన్ అధ్యక్షుడు మహేందర్, మాజీ డివిజన్ అధ్యక్షుడు ఇంటూరి అంకిరెడ్డి, నియోజకవర్గ యూత్‌వింగ్ మాజీ అధ్యక్షుడు లోకసాని కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్లపై మూడో సారి గులాబీ జెండా

### ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్ , ఏప్రిల్ 20 : బీసీ బిడ్డ, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను అఖండ మెజార్టీతో గెలిపించుకుని చేవెళ్లపై మూడో సారి గులాబీ జెండా ఎగురేస్తామని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. కాసానితో పాటు కార్పొరేటర్లు హమీద్ పటేల్, రాగం నాగేందర్ యాదవ్, జూపల్లి సత్యనారాయణ, నార్నె శ్రీనివాస్‌రావు, ఉప్పలపాటి శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్ సాయిబాబా, పార్టీ డివిజన్ అధ్యక్షులతో ఎమ్మెల్యే గాంధీ తన నివాసంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాసాని జ్ఞానేశ్వర్ గెలుపుకోసం శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నేతలు మోహన్ , రవీందర్, సంజీవరెడ్డి, రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి

## ఆగం కావొద్దు.. ఆలోచించి ఓటెయ్యాలి

### కాంగ్రెస్, బీజేపీకి ఓట్లు అడిగే హక్కులేదు

### మల్కాజిగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

ఉప్పల్, ఏప్రిల్ 20 : ఆరు గ్యారెంటీలంటూ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని మల్కాజిగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. ఉప్పల్‌లోని ఎస్ఆర్ బాంకిట్‌హాల్‌లో శనివారం జరిగిన బీఆర్‌ఎస్ సమీక్షా సమావేశానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి జహంగీర్‌పాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీకి ఓట్లు అడిగే హక్కులేదన్నారు. మల్కాజిగిరి ఓటర్లు ఆగం కాకుండా ఆలోచించి ఓటు వేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి.. బీఆర్‌ఎస్ సర్కారు అమలు చేసిన సంక్షేమ పథకాలు, కాంగ్రెస్, బీజేపీలు చేసిన మోసపూరిత వాగ్దానాలను ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు వేముల సంతోష్‌రెడ్డి, భాస్కర్ ముదిరాజ్, సుధాకర్, మేకల హన్మంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గన్‌ఫౌండ్రిలో ప్రచారం చేస్తున్న హైదరాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్

## పేదల సంక్షేమానికి అనేక పథకాలు

### ఆ ఘనత కేసీఆర్‌దే

### హైదరాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్‌యాదవ్

అబిడ్స్, ఏప్రిల్ 20: పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కిందని హైదరాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. గన్‌ఫౌండ్రి డివిజన్ పరిధిలోని బిర్లా మందిర్ తదితర ప్రాంతాల్లో ఆయన పాదయాత్ర చేసి ఇంటింటి ప్రచారం చేశారు. కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేసి అభివృద్ధి కోసం పాటు పడే బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.




బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న కంటోన్మెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత

## గెలుపే లక్ష్యంగా..

**న్యూ బోయిన్‌పల్లిలోని** బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం వద్ద శనివారం ఎన్నికల ప్రచార రథాలను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యులు అనితాప్రభాకర్, నళిని కిరణ్, పాండుయాదవ్, భాగ్యశ్రీశ్యామ్‌కుమార్, లోకనాథ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

-కంటోన్మెంట్, ఏప్రిల్ 20

## సిటీ తాగునీటికి ఇబ్బందుల్లేకుండా..

### నాగార్జునసాగర్‌లో అత్యవసర పంపింగ్

### ప్రారంభించిన జలమండలి ఎండీ

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహానగర మంచినీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా నాగార్జునసాగర్‌లో అత్యవసర పంపింగ్ ప్రారంభమైంది. మాధవరెడ్డి ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోత చేపట్టేందుకు సాగర్‌లో కనీసంగా 510 అడుగులు (ఎండీడీఎల్) నీటిమట్టం ఉండాలి. అంతకంటే నీటిమట్టం తగ్గడంతో జలమండలి అధికారులు అత్యవసర మోటర్లను ఏర్పాటు చేసి.. సాగర్ జలాశయం నుంచి నీటిని మాధవరెడ్డి ప్రాజెక్టులోని అప్రోచ్ చానల్‌లోకి తరలిస్తున్నారు. తద్వారా ప్రాజెక్టు మోటర్ల ద్వారా అక్కంపల్లి రిజర్వాయర్‌కు నీటి సరఫరా నిరంతరాయంగా కొనసాగుతుంది. నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం పుట్టంగండి వద్ద నాగార్జునసాగర్ ఫోర్‌షోర్‌లో పది పంపుల్ని ఏర్పాటు చేయగా... శనివారం ఎండీ సుదర్శన్‌రెడ్డి ప్రారంభించారు. నగర తాగునీటి అవసరాల దృష్ట్యా సాగర్‌లో అత్యవసర పంపింగ్ ప్రారంభించినట్లు తెలిపారు. వచ్చే నెల 15 నుంచి ఎల్లంపల్లి జలాశయంలో అత్యవసర పంపింగ్ ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్, సింగూరు జలాశయాల్లో నీరుందని, హైదరాబాద్ తాగునీటి సరఫరాకు ఢోకా లేదన్నారు. సాగర్‌లో ప్రస్తుతం 508 అడుగుల నీటిమట్టం ఉన్నదని, ఎండీడీఎల్ 510 అడుగుల కంటే నీటిమట్టం తగ్గినందున అత్యవసర పంపింగ్ ఏర్పాటు చేశామన్నారు. గత ఏడాదితో పోలిస్తే నగరంలో 175 ఎంఎల్‌డీల అదనపు నీటిని సరఫరా చేస్తున్నామని ఎండీ వివరించారు. వచ్చే నెల 15 నుంచి మరో 30 ఎంఎల్‌డీల అదనపు నీటిని కూడా సరఫరా చేస్తామన్నారు. ఈడీ సత్యనారాయణ, టెక్నికల్ డైరెక్టర్ రవికుమార్, ప్రాజెక్టు డైరెక్టర్-2 సుదర్శన్ పాల్గొన్నారు.





శనివారం వర్షం కారణంగా మైండ్‌స్పేస్ వద్ద స్తంభించిన ట్రాఫిక్

## మరో 3 రోజులు వర్షం

సిటీబ్యూరో, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో నగరంలోని పలు చోట్ల శనివారం ఉరుములు, మెరుపులు..ఈదురుగాలులతో జోరు వాన కురిసింది. రహదారులు జలమయం కావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి ప్రజలు అవస్థలు పడ్డారు. కొన్ని చోట్ల చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై పడటంతో పాటు స్తంభాలు విరిగిపోవడంతో కరెంటు సరఫరాకు అంతరాయం కలిగింది. అప్రమత్తమైన టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ సిబ్బందిని వెంటనే మరమ్మతులు పూర్తి చేసి సరఫరాను పునరుద్ధరించారు. గచ్చిబౌలిలో అత్యధికంగా 2.8 సెం.మీల వర్షపాతం నమోదవ్వగా, రాజేంద్రనగర్, శివరాంపల్లిలో 2.2, కిషన్‌బాగ్, షేక్‌పేటలో 2.0, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురలో 1.6, ఖైరతాబాద్, ఫిల్మ్‌నగర్‌లో 1.3, జుమ్మెరాత్‌బజార్, విజయ్‌నగర్‌కాలనీ, హిమాయత్‌నగర్, నాంపల్లి, బేగంబజార్, కాంచన్‌బాగ్ తదితర ప్రాంతాల్లో 1.0 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైంది. రాగల మరో 3రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. నగరానికి ఎల్లో అలర్ట్ హెచ్చరికలు జారీ చేశారు.